

కవిసమయం

పాలడుగు వెంకటేశ్వరరావు

జులపాల జుట్టు, కళ్ళజోడు, గ్లాస్కో లాల్చీ, పైజామా, కాళ్లకి స్లిప్పర్లు ధరించిన ఒక యువకుడు హోటల్ మాధురి రెండో అంతస్తు నుండి గబ గబ దిగివచ్చి లాన్‌లోకి వచ్చి అటు ఇటు పారచూశాడు. సన్నగా వర్షపు జల్లు పడుతుంది. గేటు దగ్గర ఒక్క రిక్షాయే నిలబడి వుంది

అతను గబగబ రిక్షా వద్దకి వెళ్లేడు.

'ఏయ్ రిక్షా!' అని పిలిచేడు.

'అయ్యా.'

'వస్తావా ? టౌను హాలుకి వెళ్ళాలి.'

'వస్తాను బాబూ.'

అతన్ని ఎక్కించుకొని రిక్షా టౌను హాలువేపు పరుగులు పెట్టింది.

దారిలో అతను రిక్షావాడిని మాటల్లో పెట్టాడు. రిక్షా అద్దె ఎంత, ఎప్పట్నుంచి ఎప్పటివరకు, అద్దె పోగా రోజుకి ఎంత మిగులుతుంది, కుటుంబంలో ఎంత మంది వున్నారు, ఆ సంపాదన అందరికీ సరిపోతుందా, ఎక్కడ వుంటున్నారు. ఎలా తింటున్నారు ఇత్యాది ప్రశ్నలు

అడిగి సమాధానాలు రాబట్టాడు రిక్షావాడి నుంచి.

అతన్లో ఆవేశం పొంగింది. ఉద్రేకం కట్టలు తెంచుకుంది.

ఆది నిల్చుకోలేకపోయాడు. వణకి పోయాడు.

'నీ లాంటి నా సహోదరులందరు చెమటోడ్చి కష్టపడుతున్నారు. అయినా మీకు కడుపునిండా తిండి దొరకటంలేదు. వంటినిండా బట్టలేదు. ఉంటానికి గూడు లేదు. ఘర్మ జలానికి విలువలేదు. వ్ళ్ళ కాలు కదపకుండానే, పొట్టలు పెంచే వాళ్ళు మేడలు కడ్తున్నారు. అదే మన దౌర్భాగ్యం. మీరే గాదు మన దేశంలో లక్షలాది సోదరీమణులు మగవాడి దౌష్ట్యం ముందు తలవంచి తరతరాల, శతాబ్దాల తరబడి అణగారిపోయి వున్నారు. ఈ పీడితులందరికి విముక్తి కావాలి అదే నా ధ్యేయం. అదే నా లక్ష్యం. అందుకోసం ప్రాణాలకయినా తెగించి పోరాడతాను పోరాటం నా ప్రాణం. కనుక సోదరా! వూరడిల్లు. మంచిరోజులు ముందున్నాయి. వాటి మీద ఆశల్ని నిల్పుకో. దీక్షగా శ్రమించి కృషిచెయ్యి. విజయం నీదే. నా వాక్య తధ్యం...నిజం, అని ఉపన్యసించాడు.

రిక్షా అతను నవ్వుకుని అడిగాడు.

'అయ్యా, ఇంతకీ మీరెవరు? ఏం చేస్తూ వుంటారు? మీది చాల జాలి గుండె సార్.'

'దురదృష్ట జీవీ! సోదరా. ఇంకా తెలీలేదా? నేను కవిని 'దూకుడు కవిని'. నా ధోరణికి అడ్డులేదు. నాకు అడ్డు వచ్చినవాడ్ని బడ బూతులు తిట్టి తల వంచుకొనేట్టు చేస్తాను తిట్టుకవితే అయినా నిండుగా బూతులు గుమ్మరిస్తాను ఎవడివాడి కవిత్వంలో లేని లోపాల్ని కూడ వెతికి వెలికిదీసి, బయటపెట్టి దులిపి పారెయ్యగలను. నా కవిత్వం గురించి సొంత డబ్బా అమోఘంగా వాయించుకోగలను. నా వంకర రాతలన్నీ ఘాటు విమర్శలుగా చెలామణి అయేట్టు చేసుకోగలను... అందువలన నేనంటే అందరికీ భయం!'

'అయ్యా. ఇవంతా ఎలా చేయగలరు మీరు?'

'నా అభాగ్య సోదరా!...పత్రిక నాయనా...నా చేతిలో పత్రిక వుంది. అందుచేత నా రాతకి తిరుగులేదు. విన్నావా? అందుకని నేను నీలాంటి పీడితప్రజల కొమ్ము కాశాను. కనుక భయంలేదు. నన్ను నమ్ము. మంచి రోజులు ముందున్నాయి మీకందరికీ...'

'కవిగారూ! చాల కృతజ్ఞులమండి. ఇంతకీ మీ దేవూరు? టౌనుహాలుకి ఎందుకు వెళ్తున్నారు?'

కవి చిత్రంగా చూసాడు.

రిక్షావాడిమీద జాలిని గుమ్మరించాడు చూపుల్తోనే.

'ఇంకా నీకు తెలీదా పీడిత

సహోదరా! మీ వూరి టౌనుహాలులో ఇపుడు పెద్ద సభ జరగబోతోంది. అందులో నాలాంటి ప్రముఖులయిన కవులు ఉపన్యసిస్తారు నీకు తెలీదుగాని ఇవాళ్టితో మీ వూళ్లో గొప్ప మార్పు వచ్చి తీరుతుంది జనం వుత్తేజితులై ముందుకురుకుతారు. నడుం బిగిస్తారు. కార్యసాధన కుపక్రమిస్తారు...'

బాగానే వుంది కవిగారూ. ఇంతకీ మీ దేవూరు? ఎక్కడో, ఎప్పుడో చూసి నట్లుంటేను ...... అడగాలనిపించింది. మరేం అనుకోకండి...'

'దాందే ముంది నా సోదర దామోదరా! ఆంధ్రదేశంలో నేను తిరగని నాడూ వూరులేదు. నేను వుపన్యసించని గొప్ప మీటింగు లేదు. ఎక్కడో చూసి వుంటారు. నన్ను, ఇవాళా చూస్తావుగా. నేనెంత గొప్పగా వుపన్యసిస్తానో, జనం అది విని ఎలాగ వెర్రెత్తిపోతారో: నా సంగతి నీకు తెలీదు. నేను నోరు విప్పితే దిగ్గజాల్లాంటి ముసలి కవులు గూడ గజగజ వణికిపోవల్సిందే బూజు కవులు, పురాణ కవులు, నీతుల కవులు అందరు ఆ ఝంఝూమారుతంలో కొట్టుకుని పోవలసిందే అది గొప్ప ప్రవాహం. అది ఆగదు. ఆగనీయదు...'

టౌనుహాలు వచ్చింది.

కవిగారు దిగారు.

'నీ శ్రమ ఫలితం ఎంత సోదరా?' జాలిగా అడిగారు కవిగారు.

'మీ దయ బాబూ. మరల మీరు నా రిక్షాలోనే హోటలు కెళ్ళాలి. ఇక్కడే వుంటా'

అంతలో సభానిర్వాహకులు పరుగెత్తుకుని వచ్చారు. 'మీరు రాలేదేమూ అని కంగారుపడి తొక్కుకు ఛస్తున్నాము. ఎలాగయితేనేం మీరు వచ్చారు. థాంక్స్' అని ఆనందం ప్రకటించారు. 'రాగానే వెంటనే మాధురిలో దిగాను. రేపటిదాకా వుండాలి గదా. అన్నట్టు రేపు వచ్చి ఆ ఎకౌంటు సెటిల్ చేయండి. రూం నంబరు 34, అన్నట్టు ఈ రిక్షా అతనికి ఓ రూపాయి ఇవ్వండి. పాపం పేదవాడు. మన సోదరుడు...' అంటూ నవ్వారు కవిగారు.

రిక్షావాడికి డబ్బులు ముట్టాయి.

కవిగార్ని లోనికి తీసుకుని వెళ్ళారు, అట్టహాసంగా.

టౌనుహాలు క్రిక్కిరిసి వుంది, ప్రజలతో.

ఆవేళ కవిగారు ఆవేశంతో వూగిపోయారు. అమోఘంగా కవితలు చదివారు పుస్తకం చూస్తూ. పీడిత జనాళి మీద, వారు కోరుకుంటున్న మార్పుల మీద, అందుకోసం ప్రజలు నిర్వర్తించవలసిన బాధ్యతల మీద, రాబోయే మార్పుల్ని రానీకుండా అడ్డుపడేవారి మీదా ఏకధాటిగ, రౌద్రంగా పదిహేను కవితలు చదివారు. అన్నీ ఆధునిక కవితలు. ఆ కవితలు చదువుతూ కవి

గారు, వారి గొంతు, కాలు చేతులు తెగ వూగి జనాన్ని కూడ వూపి వదిలి పెట్టాయి.

ఆ తర్వాత,

ఓ గ్లాసు కాఫీ తాగి, చిరునవ్వు నవ్వి-అంతలో దీనంగా మొహం పెట్టి-

భారత స్త్రీ మీదా, ఆమె సమస్యల మీదా, ఆ సమస్యలకి కారకులయిన వారి మీదా, ఆమె అభ్యుదయం మీదా జాలిగ, కరుణాత్మకంగా, రౌద్రంగా-ఈ రసా లన్నింటిని సందర్భానుసారంగా ప్రదర్శిస్తూ, పది కవితలు చదివారు. దాంతో సభలో వున్న ఆడ ప్రేక్షకులు గొల్లుమని ఏడ్చి మొత్తుకున్నంత పనిచేసి ముక్కులు చీదుకుని భుజా లెగరేసారు. తల లూపారు.

సభ దిగ్విజయంగా జరిగింది. కవి గారి మెడనిండా దండలే. కవిగార్ని గురించి అన్నీ పొగడ్తలే. కవి గారి రూముకి వచ్చే పోయే వారితో హోటలు మాధురి కిటకిటలాడింది.

కవిగారిని ఆ జనం వదిలిపెట్టి కవి గార్కి ఒంటరితనం మిగిలేసరికి పన్నెండయింది రాత్రి. బాగా అలంకరించుకుని జరదా కిళ్ళీ నవుల్తూ, సిగరెట్టు వూదుతూ 'మాధురి' బయటికి వచ్చారు కవిగారు.

'ఏయ్ రిక్షా ? !' కవిగారి మాట తూలింది. గుప్పున వాసన కొట్టింది; విస్కీ.

రిక్షావాడు దగ్గర కొచ్చాడు'ఆయ్.' అంటూ దగ్గరగా రమ్మన్నట్టు సౌంజ్ఞచేసి వాడి చెవిలో నోరు పెట్టాడు కవి.

'మంచి సర్కు దొరుకుతుందా ?' రిక్షా వాడు తెల్లపోయాడు. 'తెలీలా ? పిల్లోయి. మంచి పిల్ల' అన్నాడు కవిగారు. రిక్షావాడు తలెత్తి చూసి కవిని గుర్తించి తల పైకి క్రిందకీ వూపాడు.

'అయితే ఆలస్యం దేనికి ?' ఆనందం పొంగిపచ్చింది కవిగారిలో.

'ఇక్కడికే తీసుకురమ్మంటారా ?' అన్నాడు రిక్షావాడు కవిని పరిశీలనగా చూస్తూ

'ఆఁ ? రూము నంబరు 34 వెనకదారినుంచి రండి వెయిట్ చేస్తుంటాను.ఇదుగో,నీకు మంచి బక్షీసు ఇస్తాలే. క్లాసు గుండాలి, ఎంతైనా ఫర్లేదు. అంతా వాళ్ళు నెత్తిన రుద్దేదేలే.'

తల వూపి రిక్షావాడు వూళ్ళోకి పోయేడు.

వెంటనే రూంకి వెళ్ళి, తల దువ్వుకుని అద్దంలో నాల్గుసార్లు అందాన్ని సరిదిద్దు కుని,లాల్చీకి,కర్చీఫుకి, సెంటు రాసుకుని ఆత్రంగా ఎదురుచూసేడు, ఆ సమయం కోసం కవిగారు పావు గంటలో రిక్షావాడు 34 నెంబరు రూము తలుపు తట్టేడు.

అతని వెనకాలే ముసుగు కప్పుకున్న ఒక స్త్రీ అకారం వుంది.

గదిలోకి వెళ్ళగానే, తలుపు మూసి నవ్వాడు రిక్షావాడు. ఆ స్త్రీ మూర్తి బాత్



రూంలోకి వెళ్ళింది, వెంటనే. కవిగారికి ఉల్లాసం పొంగివచ్చింది.

'సెలక్షను బాగానే వున్నట్టుందోయ్. ఎన్నేళ్ళుంటచ్చు?' కవిగారడిగారు.

'పదిహేడండి. కొత్తగా పెళ్లయింది. మీరు కాస్త జాగర్తగా చూస్తోవాలి.'

'వెరీగుడ్. సర్లె. సర్లె.'

"మీరు నన్ను గమనించలా, పొద్దున తవర్ని టౌనుహాలుకి నేనే తీసికెళ్లింది గొప్పగా చెప్పారుబాబూ. బ్రహ్మాండం గుంది అన్నట్టు తమరు పుట్టినూరు ఏదో చెప్పలేదు బాబు. అన్నాడు రిక్షావాడు.

'ఏం నాయనా?' విసుగ్గా అన్నారు కవిగారు, రిక్షావాడు బయటికి పోతే బాగుండుననుకుంటూ.

'ఎక్కడో-ఎక్కడో చూసినట్లుందేనూ?' నవ్వాడు రిక్షావాడు. కవిగారికి బుస్సున కోపం పొంగివచ్చింది. 'ఎక్కడ చూసివుంటావు? నీ మొహం' అన్నాడు.

రిక్షావాడు నవ్వుతూ కవిగారి మొహంలోకి చూస్తూ అన్నాడు. 'తమరి పేరు గణపతి గారండి. చిన్నప్పుడు తెలుగు మాష్టారిచేత పిడిగుద్దులు తినేవారం మనం. మీరు పెళ్ళయాక పెళ్ళాం పోరు పడలేక దేశాలు పట్టి పోయారు, నాటకాలంటూ. మీ వూరు, మా వూరు మన వూరే...'

కవి వులికిపడ్డాడు చిరాకుపడ్డాడు. అసహనంగా మొహం పెట్టాడు. గంభీరమైన ఠీవితో 'చాల్లే! ఈ సొదంతా ఎందుకుగాని త్వరగా పని కానివ్వు,' అంటూ తొందరపెట్టాడు.

అంతలో ఆ 'స్త్రీ' వచ్చి, కవిని వాటేసుకుంది, గట్టిగా. కవిగారు ఉక్కిరిబిక్కిరయ్యారు.

'నన్ను రక్షించాలి కవి బాబూ. లేకపోతే నన్ను బతకనీదు నా భర్త. చంపేస్తాడు. నాకు మీరే దిక్కు, బాబోయి. నేను చచ్చిపోలేను కవి బాబూ. నన్ను

నువ్వేకాపాడాలి బాబూ' అంటూ వూపిరాడనంతగా కవిమీద పడింది. తన హృదయం ద్రవించి సల్లపింపించిన కవికి జాలిగా మూలిగాడు.

కవి ఆ స్త్రీని మృదువుగా ఓదారుస్తూ సంగతిసందర్భాలు విచారిస్తూ వుండగా—ఒక గొప్ప క్షణాన—ఆ స్త్రీ మూర్తి మీసం గరుగ్గా కవి చంపకి తగిలింది! కవి వులికిపడ్డాడు! ఆ మూర్తి, నిజానికి పురుషుడేనని తెలాక, కవి కుపితుడై, 'ఎవర్రా నువ్వు' అన్నాడు. రౌద్రంగా గర్జించాడు

'నీ మొగుణ్ణిరా' అంది, ఆ స్త్రీ, వేషం తీసేస్తూ. ఆంబోతులాంటి ఆరడుగుల సత్తిగాడి యొక్క అవతారం ఎత్తి.

'ఇందాక టౌనుహాలులో స్త్రీజనాన్ని వుద్ధరిస్తానని ఆవేశంతో కోతలు కోసావుగదరా రాస్కెల్. ఇలాగేనట్రా స్త్రీల నుద్ధరించటం? సిగ్గులేదట్రా? నువ్వు కవివా? దూకుడు త్రాగుబోతు కవివా? బ్లడీఫెలో, నువ్వు మనిషి అన్పించుకోటానికయినా అర్హుడివి కాదు గదరా!

ఇటువంటి నీచప్రవృత్తిగల నువ్వా ప్రజల్ని నడిపించేది? ఎందుకురా నువ్వూ, నీ కవిత్వమూ, స్త్రీ గురించి స్లోగన్సూ? ఈసారి గనుక ఈ వూరొచ్చి నోరు తెరిచావో వుప్పులో పాతేస్తాను జాగ్రత్త...' అంటూ భీకరంగా గర్జించాడు ఆ 'స్త్రీమూర్తి,' సత్తిగాడు కవిగారు తలవంచుకున్నారు. మొహాన నెత్తురుచుక్క లేదు భయంతో గజగజ వణికారు. 'ఒరే సత్తిగా చాల్లేరా. చచ్చిన పామునేం చంపుతావు?' అన్నాడు రిక్షావాడు.

'కాదురా కామిగా ఇటువంటి పాముల్ని చంపి తగలెట్టాలి.' అంటూ కవిమీదకి వురకబోయిన సత్తిగాణ్ణి, కామిగాడు బయటికి లాక్కొచ్చి తలుపేస్తూ 'గణపతీ! ఎదిగాననుకుంటున్నావ్!? పోన్లే తలుపేసుకుని పడుకో. ఇంతకీ నువ్వు మమ్మల్ని గుర్తించలేదనుకుంటాను. సత్తిగాడూ, శర్మగాడూ, నేనూ, నువ్వూ క్లాసుమేట్సుము, అయిదో తరగతి దాకా. ఉద్యోగాల్లేక ఇలాగ మేము రిక్షా లాగి బ్రతుకుతున్నాంలే మార్పు—నువ్వు చెప్పిన ఆ మార్పు తప్పక వస్తుందిరా. కాని—కాని—అది నీలాంటిదగుల్బాజీలవల్లగాదు గుర్తుంచుకో. మరలా ఇలాంటి వేషాలు ఎక్కడా వెయ్యకు. జాగ్రత్త. వస్తాం' అంటూ దభీమని తలుపు వేసాడు, 'రిక్షా కామిగాడు.'

కవిగారి గుండె చలన వేగం ఎక్కువయి పావుగంటసేపు అలాగే జోరుగా కొట్టుకుంటూ వుండింది. కాళ్ళు వణుకు పోవటానికి అరగంట పట్టింది.

అప్పటికీ శరీరం నిండా చమటలు కారటం మానలేదు. అవమానంతో, కోపంతో పళ్ళు కొరకటం తగ్గలేదు. కవిగారు కపి అవతార మెత్తేసు